www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం      తెలుగు దినపత్రిక

సంపుటి - 2    సంచిక -200    బుధవారం 2 అక్టోబర్ 2024    ఎడిటర్ : మారేపల్లి అశోక్    పేజిలు -6  వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం   తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545

# హైడ్రాకు హైపవర్




## ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోదం

- గవర్నర్ జిష్ణుదేవ్ ఆమోదం
- పూర్తిస్థాయిలో చట్టబద్ధత
- విస్తృత అధికారాలతో ప్రత్యేక ఆర్డినెన్స్‌కు సర్కార్ రూపకల్పన
- హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్,అక్టోబర్ 1, ప్రజావినికిడి:

హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ(హైడ్రా)కి విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెను మంగళవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. దీంతో ఇకపై హైడ్రా చేపట్టబోయే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత లభించింది. ఈ చట్టాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు హైడ్రాకు ఈ ఆర్డినెన్స్ రక్షణగా ఉండనుంది. ఇటీవల ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్సుపై గవర్నర్ పలు సందేహాలు వ్యక్తం చేయగా.. వాటిని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ నివృత్తి చేయడంతో గవర్నర్ ఆమోదముద్ర వేశారు.బలోపేతం దిశగా..చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, ఆటస్థలాలు సహా ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడం. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రక్షణ చర్యలు, భారీ వర్షాలు సంభ వించినప్పుడు ట్రాఫిక్ పోలీసులతో



సమన్వయం చేసుకొని క్రమబద్ధీకరించడం, అగ్నిమాపకశాఖసేవలకు సంబంధించి నిరభ్యంతర పత్రం (ఎన్ వోసీ) జారీ తదితర లక్ష్యాలతో జులై 19న జీవో ఎం. ఎస్. నం.99 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని దీని పరిధిలో చేర్చింది.

# కేంద్రం వరద సాయం...

- ఏపీకి రూ.1,036 కోట్లు, తెలంగాణకు రూ.416 కోట్లు విడుదల
- 14 వరద ప్రభావిత రాష్ట్రాలకు రూ.5,858 కోట్లు విడుదల
- అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,432 కోట్లు విడుదల
- తక్షణ సాయంగా నిధులు మంజూరు చేసిన కేంద్ర హెూంశాఖ



హైదరాబాద్,అక్టోబర్ 1, ప్రజావినికిడి:
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా వరద ప్రభావిత రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. మొత్తం 14 రాష్ట్రాలకు రూ.5,858.60 కోట్ల నిధులను విడుదల చేసింది. తెలంగాణకు రూ.416.80 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,036 కోట్లను విడుదల చేసింది. అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,432 కోట్లను ఇచ్చింది.గుజరాత్‌కు రూ.600 కోట్లు, కేరళకు రూ.145.60 కోట్లను కేటాయించింది. రాష్ట్ర విపత్తు నిధికి ఎన్డీఆర్ఎఫ్ నుంచి కేంద్రం వాటాగా ఈ మేరకు నిధులను విడుదల చేసింది.ఇటీవల భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ, కేరళ సహా వరద ప్రభావిత రాష్ట్రాల్లో కేంద్ర బృందాలు పర్యటించాయి. వరదల వల్ల ఆయా రాష్ట్రాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేస్తూ నివేదిక ఇచ్చాయి. దీంతో తక్షణ సాయంగా కేంద్ర హెూంశాఖ నిధులను మంజూరు చేసింది.

## మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ను తెచ్చిందే బీఆర్ఎస్



- మూసీలో అక్రమ కట్టడాలను గుర్తించాలని కేసీఆర్ ఆదేశించలేదా?
- మూసీ ప్రక్షాళనపై విపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాయి
- మంత్రి శ్రీధర్‌బాబు కీలక వ్యాఖ్యలు

2లో.

# మూసీ ప్రక్షాళన పేరుతో లూటీ

- మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్
- ఎమ్మెల్యేలతో కలసి అంబర్‌పేటలో పర్యటన
- బాధితులకు భరోసా ఇచ్చిన బిఆర్ఎస్ నేతలు



హైదరాబాద్,అక్టోబర్ 1, ప్రజావినికిడి: మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సర్వే, కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లో లక్షలాది మందికి నిద్రలేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఇండ్లు కూల్చుతరోనని ప్రజలు ఆవేదనలో ఉన్నారని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక పరిధి తులసీరామ్ నగర్‌లో మూసీ ప్రాంత వాసులను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డితో కలిసి కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. మిగతాది 2లో...

## కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదు

**బిజెపి దీక్షలో మండిపడిన ఎంపి ఈటల రాజేందర్**



హైదరాబాద్,అక్టోబర్ 1, ప్రజావినికిడి: మాట వినని వాడు సైకో అవుతాడు.. ప్రజలను ఏడిపించి .. సంతోషించే వాడు శాడిస్ట్ అవుతాడంటూ మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్..సీఎం రేవంత్ పై ఫైర్ అయ్యారు. నగరంలోని ఇందిరాపార్క్ వద్ద 24 గంటలుగా బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ నిరంతర దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూమిగతాది 2లో...

## నేటినుంచే బతుకమ్మ సందడి

**ఊరూవాడా ఇక సందడే సందడి**



# సద్దుల బతుకమ్మకు, దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి

**- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ**

**నగర మేయర్, జిల్లా కలెక్టర్, సిపి, లతో కలసి సంబంధిత అధికారులతో ఏర్పాట్ల పై సమీక్షించిన మంత్రి..**

..వరంగల్అక్టోబర్ 1, ప్రజావినికిడి: బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని, రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అధికారులను ఆదేశించారు.మంగళవారం కరిమాబాద్ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధ్యక్షతన జిల్లా యంత్రాంగం, జిడబ్ల్యూఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో రంగలీల మైదానం (ఉర్సు గుట్ట) కరీమాబాద్ ప్రాంతంలో సద్దుల బతుకమ్మ, దసరా పర్వదినం సందర్భంగా నిర్వహించిన సమావేశానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరైనారు.





## మూసీ ఇళ్ల కూల్చివేత మొదలు

2లో.

- ఖాళీ చేసిన వారి ఇళ్ల కూల్చివేత ప్రారంభం
- బందోబస్తు మధ్య కొనసాగుతున్న పనులు
- ఖాళీ చేసిన వారిని డబుల్ ఇళ్లకు తరలింపు

# మూసీ ప్రక్షాళన పేరుతో లూటీ

(మొదటి పేజి తరువాయి)

హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసిన వారిపై సీఎం పగపట్టారన్నారు. గరీబోళ్లంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నరని, వాళ్ల బతుకులను ఆగం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. మూసీమే లూఠో.. దిల్లీ మే బాంటో అనేది కాంగ్రెస్ నినాదమని విమర్శించారు. మీ ఇండ్ల మీదకు బుల్డోజర్ వస్తే కంటె అడ్డుపెట్టాలన్నారు. రేవంత్ రెడ్డి కాదు.. ఆయన తాత వచ్చినా ఏమీ చేయలేరన్నారు. రాష్ట్ర
బడ్జెట్‌లో సగం డబ్బులతో మూసీ ప్రక్షాళన చేపట్టారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంత వాసులను అడవిలోకి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కడతామంటూ కూల్చుతున్నారని చెప్పారు. పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడపలుక్కున్నారా? అని అడిగారు. పేదలకు కష్టం వస్తే అండగా ఉండేవాడే దేవుడని అన్నారు. రేవంత్ రెడ్డి నీవు మొగోడివైతే నీవు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బ్రోకర్లు విడగొట్టే ప్రయత్నం చేస్తారని, మన హక్కులను లాక్కునే హక్కు ఎవరికీ లేదన్నారు. మీకోసం బీఆర్ఎస్ తరఫున కోర్టులో కొట్లాడుతామని భరోసానిచ్చారు.ద

# కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదు

(మొదటి పేజి తరువాయి)

కాంగ్రెస్ తాట తీసే శక్తి ప్రజలకు, రైతులకు ఉంటుందన్నారు. ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని హెచ్చరించారు. అంతరాత్మ సాక్షిగా ఏది అనిపిస్తే అది చెప్పండి.సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన చిలుక పలుకులు మాట్లాడితే గౌరవం పోతుందని మంత్రి తుమ్మలను ఉద్దేశించి హితువుపలికారు. ప్రభుత్వం ఇస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ రైతుల అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తరహాలోనే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు బొంద పెడతారన్నారు. రెండు మూడు రోజుల్లో రింగ్ రోడ్డు వద్ద ధర్నా చేస్తామన్నారు. సాక్షాత్తు హైకోర్టు హైడ్రాపై మొట్టికాయలు వేసిందని.. అవి వేసింది హైడ్రాపై కాదు నేరుగా సీఎం రేవంత్ రెడ్డికి వేసిందంటూ వ్యాఖ్యలు చేశారు.కోర్టు వ్యాఖ్యలతోనైనా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న. ప్రజలు నీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పైసలు ఎలా సంపాదించాలనే దానిపైనే ధ్యాస ఉందంటూ విమర్శలు గుప్పించారు. లిక్కర్ స్కామ్‌లు చేసి జైళ్లల్లోకి వెళ్లారన్నారు. కేసీఆర్ శకం ముగిసిందని.. కామెంట్స్ చేశారు. కేటీఆర్, కవితల మోసం చూసి ఎవ్వరూ కూడా వోటు వేయరన్నారు.

# మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ను తెచ్చిందే బీఆర్ఎస్

## మంత్రి శ్రీధర్‌బాబు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,అక్టోబర్ 1, ప్రజావినికిడి: మూసీ ప్రక్షాళన విషయమై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలకు మంత్రి శ్రీధర్ బాబు గట్టి కౌంటర్ ఇచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతల తీరును తప్పుబట్టారు. 'మూసీ ప్రక్షాళనపై విపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ను తెచ్చిందే బీఆర్ఎస్ సర్కారు. మూసీలో అక్రమ కట్టడాలను గుర్తించాలని గతంలో కేసీఆర్ ఆదేశించలేదా?. మూసీని కాలుష్య రహితంగా చేయాలని కేసీఆర్ చెప్పలేదా? గతంలో బీఆర్ఎస్ నేతలు చేసిన పనులను మరిచిపోయినట్లున్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం. 2021లో మూసీపై బీఆర్ఎస్ ప్రభుత్వం సమావేశాలు నిర్వహించింది. మూసీకి 50 మీటర్ల దూరంలో బఫర్ జోన్ ను నిర్ణయించారు. మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. బీఆర్ఎస్ హయాంలోనే మూసీ సరిహద్దులను ఫిక్స్ చేశారు. ఇప్పుడు మూసీ ప్రక్షాళన ఎందుకంటూ బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. విశ్వనగరం అనే పేరులోనే కాక కార్యాచరణ చేపట్టాలని మా ప్రభుత్వం ఆలోచిస్తుంది' అంటూ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో డిజెలపై నిషేధం

**వెల్లువెత్తిన ఫిర్యాదులతో పోలీసు శాఖ నిర్ణయం నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుశిక్ష, జరిమానా మతపరమైన ర్యాలీల్లో బాణసంచాపై ఆంక్షలు పరిమితస్థాయిలో సౌండ్‌సిస్టమ్‌కు అనుమతి నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ ఆదేశాలు**



హైదరాబాద్,అక్టోబర్ 1, ప్రజావినికిడి:నగరంలో డిజెలు, ఫైర్ క్రాకర్స్‌లపై నిషేధం విధిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ మంగళవారం ఆ దేశాలు జారీ చేశారు. నగర పరిధిలో ఇప్పటి నుంచి మతపరమైన ర్యాలీల్లో డిజేలు, ఫైర్ క్రాక ర్స్ ఉపయోగించవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇ చ్చారు. భారీ శబ్దాలతో డీజేలు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని హైదరాబాద్ వాసులు వరుసగా పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో దీనిపై నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ దృష్టిసారించారు. ఈ క్రమంలోనే నగరంలోని రాజకీయ పా ర్టీల ప్రతినిధులు, అన్ని మతాల పెద్దలతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకున్నారు. చర్చల సమయంలో డిజేలు, ఫైర్‌క్రాకర్స్ వల్ల న గరం లో గతంలో జరిగిన సంఘటనల గురించి హైదరాబాద్ సిపి ప్రతినిధులకు వివరించారు. తర్వా త డిజేలపై నిషేధంపై ప్రభుత్వ నిర్ణయానికి పం పారు. ప్రభుత్వం నుంచి డిజే, ఫైర్ క్రాకర్స్‌పై ఆ దేశాలు రావడంతో వాటిని నిషేధిస్తు ఆదేశాలు జారీ చేశారు. అయితే సౌండ్ సిస్టమ్‌లను పరిమి తస్థాయిలో అనుమతిస్తున్నట్లు వెల్లడించారు. సౌండ్ సిస్టమ్ పెట్టడానికి కూడా పోలీస్ క్లియరె న్స్ తప్పనిసరని స్పష్టం చేశారు. నాలుగు జోన్లలో సౌండ్ సిస్టమ్‌లు పెట్టడానికి డెసిబిల్స్‌ను నిర్దేశి స్తూ కొత్త మార్గదర్శకాలు జారీ చేశారు.జనావాసాల ప్రాంతంలో ఉదయం 55 డెసిబెల్స్‌కు మించి పెట్టరాదని తెలిపారు. అలాగే రాత్రి వేళల్లో 45డెసిబెల్స్‌కు మించరాదని పేర్కొన్నారు. మతపరమైన ర్యాలీల్లో బాణసంచా కాల్చడం పూ ర్తిగా నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. సౌండ్ సిస్టమ్స్ పరిమితికి మించి పెద్దపెద్ద శబ్దాలతో హంగామా చేసినా ఐదు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.లక్షల జరిమానా విధిస్తామని తెలిపారు. పదే పదే నిబంధనలు ఉల్లంఘిస్తే రోజుకు రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

# మూసీ ఇళ్ల కూల్చివేత మొదలు

హైదరాబాద్,అక్టోబర్ 1, ప్రజావినికిడి: మూసీ పరివాహక ప్రాంతాల్లో కూల్చివేతలు మొదలయ్యాయి. చాదర్‌ఘాట్ శంకర్ నగర్ బస్తీలో కూల్చివేతలను మంగళవారం ఉదయం అధికారులు ప్రారంభించారు. ఇళ్ళు ఖాళీ చేసిన వాటిని అధికారులు కూల్చివేస్తున్నారు. ఎలాంటి అవాంతరాలు జరుగకుండా భారీగా పోలీసులను మోహరించారు. దాదాపు 140 ఇళ్లు ఖాళీ అయ్యాయి. ఇళ్లు ఖాళీ చేసిన వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించినట్లు సమాచారం. ఈ క్రమంలో మలక్‌పేట పరిధిలోని శంకర్‌నగర్‌లో మూసీ రివర్‌బెడ్‌లోని ఇళ్ల కూల్చివేతలను అధికారులు చేపట్టారు. ఇక్కడ స్వచ్ఛందంగా ఖాళీ చేసిన నిర్వాసితుల ఇళ్లను కూల్చివేస్తున్నారు. వీధులు ఇరుకుగా ఉండటంతో కూలీల సహాయంతో కూల్చివేతలు కొనసాగిస్తున్నారు. నిర్వాసితులను రెండు పడక గదుల ఇళ్లకు తరలిస్తున్నారు. నిర్వాసితుల సామగ్రి తరలింపునకు వాహనాలను ఏర్పాటు చేశారు. మరోవైపు అంబర్‌పేట్ నియోజకవర్గం గోల్నాక డివిజన్ తులసి రామ్ నగర్‌లో మూసీ పరీవాహక ప్రాంత వాసులను భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించనున్నారు. ఈ కూల్చివేతలపై స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ స్పందించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. మా ఇళ్లు



కూల్చడానికి మీరు ఎవరు..? ఇళ్లు కూల్చి ఇక్కడ పార్కులు కడతారా..? అని ప్రశ్నించారు. కాగా.. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించేందుకు, ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలను పునరుద్ధరించి, కాలుష్య కోరల నుంచి మూసీని కాపాడేందుకు ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది.అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు. అందులో దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలింది. అందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు. దీంతో ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే జీఓ కూడా జారీ చేసింది. అయితే డబుల్ బెడ్రూమ్‌లు ఎవరికి ఇవ్వాలనే దానిపై తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి.. గుర్తించి ఇళ్లపై గుర్తులు వేశారు. కాగా... ఇటీవల మూసీ నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ఇళ్లను గుర్తించి వాటిపై పెద్ద అక్షరాలతో పెయింట్ వేసిన విషయం తెలిసిందే. అయితే తమ ఇళ్లను కూల్చి వేస్తారంటూ ఆందోళన చెందిన స్థానిక ప్రజలను అధికారులపై తిరగబడ్డారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ పలువురు స్థానికులు ఆందోళనకు దిగారు. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ఇళ్లు, వాటి యాజమానుల వివరాలు నమోదు చేసేందుకు వచ్చిన అధికారులను పలు ప్రాంతాల్లో నివాసితులు అడ్డుకున్నారు. చివరకు భారీ పోలీసులు భద్రత నడుమ రెవెన్యూ అధికారులు ఇళ్లపై మార్క్ వేశారు. ప్రస్తుతం మరికొన్ని ప్రాంతాల్లో కూడా మార్క్ సర్వే ను అధికారులు కొనసాగిస్తున్నారు. పోలీసు భద్రత మధ్యే ఈ సర్వే సాగుతోంది. కూల్చివేయాల్సిన ఇళ్లకు అధికారులు మార్క్ వేస్తున్నారు. అక్కడి ప్రజలు ఇళ్లు ఖాళీ చేసిన వెంటనే అధికారులు ఆ ఇళ్లను కూల్చివేయనున్నారు.

# నేటినుంచే బతుకమ్మ సందడి

## శరన్నవరాత్రికి సిద్ధమయిన అమ్మవారి ఆలయాలు

హైదరాబాద్,అక్టోబర్ 1, ప్రజావినికిడి: శరన్నవరాత్రులు, బతుకమ్మ పండుగ ఈ రెండు కలగలిపి రావడంతో తెలుగు రాష్ట్రాల్లో సందడి నెలకొననుంది. బెంగాల్లో దుర్గా నవరాత్రులు వైభవంగా చేస్తారు. ఎపిలో కూడా శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా సాగుతాయి. దీంతో అమ్మవారి ఆలయాలు ముస్తాబు అయ్యాయి. బాసర, ధర్మపురి, విజయవాడ, శ్రీశైలం ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా సాగుతాయి. బుధవారం అమావస్యతో పెతరమావాస్యగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు మొదలవుతాయి. అలాగే పెద్దలకు బియ్యం ఇవ్వడం తెలంగాణలో ఆనవాయితీ. ఇది అమావాస్యరోజు పెద్ద ఎత్తున చేపడతారు. ఇదే క్రమంలో తెలంగాణ పూల జాతర బతుకమ్మలకు కూడా ప్రత్యేకత ఉంది. తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో సంబురంగా జరుపుకునే పండుగ బతుకమ్మ ఏటా 9 రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగుతుంది. ప్రతీ యేటా భాద్రపద అమావాస్య మొదలు ఆశ్వీయుజ శుక్ల అష్టమి వరకు తొమ్మిది రోజులు బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. తెలంగాణ సంస్కృతీ




సంప్రదాయాలకు జీవన విధానానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేళ తొమ్మిది రోజుల పాటూ రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా ఎక్కడ చూసినా సందడే కనిపిస్తుంది. ఈ తొమ్మిది రోజుల పాటు మహిళలు రోజుకో విధమైన బతుకమ్మను పేర్చి ఆడిపాడుతారు. పూలతో ముచ్చటగా బతుకమ్మలు తయారు చేసి అంతా కలసి ఆడిపాడతారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మతో సంబరాలు ముగుస్తాయి. తీరొక్క పూలను అందంగా స్తూపం, శంఖం, గోపురం ఆకారంలో అమర్చుకుంటారు. బతుకమ్మను ప్రధానంగా తంగేడు పూలు, గునుగు, గుమ్మడి, మందార, బంతి, చేమంతి, అడవి చామంతి, గోరింట, బీర పువ్వులతో పేరుస్తుంటారు. ఈ ఏడాది బతుకమ్మ పండుగ అక్టోబర్ 2 నుంచి 10 తేదీ వరకు జరుపుకోనున్నారు. ఈ యేడు విస్తారంగా కురిసి చెరువులు కుంటలు నిండడంతో ఎక్కడ చూసిన అడవి పూలు అందంగా విరబూసి పలకరిస్తున్నాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి సమర్పించే నైవేద్యాలకు అనుగుణంగా బతుకమ్మ పేర్లు కూడా ఉంటాయి. సద్దుల బతుకమ్మ చివరి రోజు పోయిరా బతుకమ్మ అంటూ వాటిని నీటిలో వదిలి ఆడవాళ్ళు అమ్మవారికి నమస్కారం చేసుకుంటారు. స్కూళ్లకు కూడా 2వ తేదీ నుంచి సెలవులు ప్రకటించారు. దీంతో ప్రజలు ముఖ్యంగా ఆడబిడ్డలు పల్లెలకు తరలి వెళతారు. దీంతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొననుంది.

# సద్దుల బతుకమ్మకు, దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి

నగర మేయర్ గుండు సుధారాణి నగర పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, బల్దియా కమీషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేలతో కలసి సమీక్షించి, సమర్ధ నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా, బతుకమ్మ జరుపుకుంటామని వారి సౌకర్యార్థం అవసరమగు ఏర్పాట్లు చేయాలన్నారు. బతుకమ్మ జరుపుకునే అన్ని ప్రాంతాల వద్ద మైదానం చదును, రహదారిపై గుంతలు పూడ్చాలని, డస్టింగ్, లైటింగ్, మంచినీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలతో పాటు చెరువులలో గుర్రెపు డెక్క తొలగించాలని, ఆయా పనులు వేగవంతంగా చేపట్టి బుధవారం నాటికి పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ ఆట స్థలాల వద్ద ప్రతిరోజు శుభ్రం చేయాలని మునిసిపల్ అధికారులను సూచించారు. దసరా పర్వదినం సందర్భంగా రంగలిలా మైదానంలో అంగరంగ వైభవంగా జరుపుకొనే వేడుకలకు, దసరా కమిటీ కోరిన విధంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తగినంత లైటింగ్, పారిశుద్ధ్యం, మంచినీటి సౌకర్యం, సీటింగ్ ట్రాఫిక్ నియంత్రణ, మహిళ, పురుషుల, పోలీసులతో పటిష్ట పోలీసు బందోబస్తు, సిసి కెమెరాల ఏర్పాటు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, నగరం నలుమూలల నుండి ప్రజలు వచ్చేలా టిఎస్ఆర్టిసి ద్వారా బస్సుల ఏర్పాటు, పార్కింగ్, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వైద్య అంబులెన్స్ లు, అగ్నిమాపక యంత్రం ఏర్పాటు, ఆయా చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. తెలంగాణ సంప్రదాయం, సాంస్కృతి ప్రతిబింబించే విధంగా సాంస్కృతిక కార్యక్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన అంతర్గత రహదారులలో గుంతలను పూడ్చాలన్నారు. ఏలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అంకిత భావంతో ఏర్పాట్లు చేయాలని మంత్రి కోరారు.

### నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి మాట్లాడుతూ

అనుభవజ్ఞులైన అన్ని విభాగాల అధికారుల సహకారంతో పండుగల ఏర్పాట్లను విజయవంతం చేయాలని బల్దియా కమిషనర్ ఆయా విభాగాలతో ఇప్పటికే సమావేశాలు ఏర్పాటు చేసి విజయవంతం చేయడానికి తగు సూచనలు చేయడం జరిగిందని లైటింగ్ డస్టింగ్ బల్దియా వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువుల్లో గుర్రపు డేక్క తొలగింపు గతంలో మాదిరిగా ఆలయాలకు లైటింగ్ ఏర్పాట్లు ఏర్పాట్లు చేయడం తో పాటు సద్దుల బతుకమ్మ పండుగ వరకు గుర్రపు డెక్క సకాలంలో తొలగింపుతో పాటు ప్రణాళిక ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయుటకు జీ డబ్ల్యూ ఎం సి ముందుకు వెళుతున్నదని, మంత్రివర్యుల సూచన మేరకు బల్దియా తరపున చేపట్టవలసిన కార్యక్రమాలను సమీక్షించుకొని ఏమైనా అసంపూర్తి గా మిగిలియున్న పనులు ఉంటే కమీషనర్ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటారని బల్దియా తరపున అదనపు ఏర్పాట్లు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని నగర పరిధిలోని చెరువుల వద్ద చేయాల్సిన ఏర్పాట్ల గురించి కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి వేగవంతం గా పూర్తి చేయుటకు అధికారులకు సూచనలు చేశారని ఈ సందర్భం గా మేయర్ తెలిపారు.

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి మాట్లాడుతూ

సద్దుల బతుకమ్మ, దసరా నిర్వహించుకొనుటకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి శాఖల అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. బల్దియా సంబంధిత శాఖల అధికారులతో ఆయా పనులు త్వరితంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ

బతుకమ్మ, దసరా వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుటకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు భారీ వాహనాలు ప్రధాన రహదారిపై రాకుండా మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, పల్లం పద్మ రవి, డిసిపి సలీమా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి అదనపు కమిషనర్ రాజేందర్ రెడ్డి పోలీస్, ఇరిగేషన్ ఎన్పీడీసీఎల్, ఫైర్, మెడికల్ అండ్ హెల్త్, తదితర శాఖల అధికారులు, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు సంజయ్, గుండు పూర్ణచందర్, మధుసూదన్ రాం మూర్తి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం 2 అక్టోబర్ 2024

# ఏపీ లోని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధి లో ప్రత్యేక పూజలు...




మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.. స్నేహపురి కాలనీ అధ్యక్షులు అనంతల సురేందర్ రెడ్డి..తదితరులు..

ప్రజావినికిడి,(హైదరాబాద్): మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి,మాజీ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ డొక్కా జగన్నాథం,స్నేహపురి కాలనీ నాగోల్ అధ్యక్షులు అనంతుల సురేందర్ రెడ్డి ఎంపీటీసీ, వెంకటరామిరెడ్డి, కుమార్,శివసంత్ రెడ్డి మాజీ సర్పంచ్,రాజు వర్ధన్ రెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ వలిగొండ,రాక్ టౌన్ కాలనీ మాజీ అధ్యక్షులు భీమిడీ మాధవరెడ్డి,చైతన్య రెస్టారెంట్ అధినేత, అయ్యమ్మ చౌదరి వేమన చిన్న మల్లేశ్వరరావు (మళ్ళప్ప) తదితరులు ప్రఖ్యాతిగాంచిన ఏపీ లోని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకుని వేద పండితుల ఆశీర్వచనం పొంది తదుపరి ప్రఖ్యాతిగాంచిన ర్యాలీ గ్రామంలో వెలసియున్న జగన్మోహిని కేశవ స్వామి ఆలయం దర్శించుకుని వేద పండితులచే ఆశీర్వచనం పొంది తదుపరి ప్రఖ్యాతిగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుని తదుపరి వైష్ణవ గురువులచే ఆగమ శాస్త్ర ప్రకారము ఆశీర్వచనం పొంది రెండు తెలుగు రాష్ట్రాలు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందాలని ఆ దేవ దేవదేవుడైన శ్రీవెంకటేశ్వర స్వామి వారిని కోరడం జరిగింది అని అన్నారు.

# శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయంలో దుర్గా నవరాత్రుల ఏర్పాట్లు..

**అంగరంగ వైభవంగా దుర్గా నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తాం..**

**శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ రెడ్డిగళ్ళ రత్నం..**



ప్రజావినికిడి, (మహేశ్వరం):అక్టోబర్ 01,రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపల్ రావిరాల గ్రామంలో శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయంలో దుర్గ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ రెడ్డిగళ్ళ రత్నం తెలిపారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయంలో నవరాత్రుల భాగంగా ప్రతిరోజు ఒక అవతారంలో అమ్మవారిని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.వచ్చే భక్తులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన కోరారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# ఆక్స్ఫోర్డ్ స్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు..




ప్రజావినికిడి,(ఎల్బీనగర్):అక్టోబర్ 1, తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బతుకమ్మ పండుగను ఎల్బీనగర్ లోని ఆక్స్ఫర్డ్ స్కూల్ విద్యార్థులతో కలిసి ఆటపాటలతో ఘనంగా నిర్వహించిన స్కూల్ యాజమాన్యం. దసరా సెలవులు రావటంతో ఒకరోజు ముందుగానే పాఠశాలలో విద్యార్థులతో కలిసి తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మ సంబరాలు చేసుకున్నారు.తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలతో తెలంగాణ చరిత్ర గురించి విద్యార్థులకు బతుకమ్మ పండుగ గురించి తెలియజేయటం జరిగింది.తెలంగాణా రాష్ట్రంలో ఆశ్వయుజ మాసశుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు.ఈ బతుకమ్మ (గౌరి) పండుగ లేదా సద్దుల పండుగ దసరాకి రెండు రోజుల ముందువస్తుంది.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు.

# పెద్దషాపూర్ పి.హెచ్.సి లో ఆశ వర్కర్లను వేధిస్తున్న సూపర్వైజర్ పై చర్య తీసుకోవాలని పి.హెచ్.ఎ మెడికల్ ఆఫీసర్ కి వినతి పత్రం...

**సిఐటియు జిల్లా నాయకులు నీరటి మల్లేష్..**

**ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు జి కవిత,జిల్లా కార్యదర్శి డి సునీత..**




ప్రజావినికిడి, (శంషాబాద్) అక్టోబర్ 1

సిఐటియు ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పెద్దషాపూర్ లో పి.హెచ్.సి. లో ఆశ వర్కర్లను వేధిస్తున్న సూపర్వైజర్ నాగేశ్వరి నూడల్ పై చర్య తీసుకోవాలని పెద్దషాపూర్ పి.హెచ్.ఎ మెడికల్ ఆఫీసర్.కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు జి కవిత మాట్లాడుతూ,ఆశా వర్కర్లను వేధించడం సరైనది కాదని అన్నారు ఇంట్లో చనిపోయిన గాని డ్యూటీకి రావాలని డిమాండ్ చేస్తున్న సూపర్వైజర్ పై చర్య తీసుకొని,సస్పెండ్ చేయాలని అన్నారు. అదే రకంగా ఈ పని చేత కాకుంటే ఏం పనికొస్తావు,ఏం నొస్తుంది నీకు ఎందుకు చేయవు,అని అన్న సూపర్వైజర్ పై ఖచ్చితమైనటువంటి చర్య తీసుకోవాలని లేదంటే ఆమెను సస్పెండ్ చేసే వరకు ఆందోళన చేస్తామని అన్నారు ఇకనైనా ఆశా వర్కర్లను వేధించకుండా ఉండి ఆశ వర్కర్లతో సమన్వయంగా పనిచేయించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల ,శారద, సునంద,మంజుల, నవనీత,రెహానా, సులోచన,భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన..

**తెలంగాణ లో బీజేపీ సభ్యత్వనమోదుకు మంచి స్పందన..**

**బెల్గాం ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర బిజెపి సభ్యత్వ ఇంచార్జ్ అభయ్ పాటిల్..**

**షాద్ నగర్ లో పాలమూర్ పార్లమెంట్ బిజెపి ముఖ్య శ్రేణులకు దిశా నిర్దేశం..**



ప్రజావినికిడి,(షాద్ నగర్): తెలంగాణలో రేవంత్ రెడ్డిది తుగ్లక్ పాలన అని పేద ప్రజల ఆస్తులనుకూలగొడుతూ,విధ్వంసం సృష్టిస్తున్నారని,హైడ్రా కూల్చివేతల్లో ప్రజలకు ఒక న్యాయం,తన సోదరుడికి మరో న్యాయం అంటూ కర్ణాటక రాష్ట్ర బెల్గాం బిజెపి ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర బిజెపి సభ్యత్వాల నమోదు కార్యక్రమ ఇంచార్జ్ అభయ్ పాటిల్ విమర్శించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఏ. బి.కాంప్లెక్స్ లో బిజెపి ముఖ్య నాయకులకు ఎమ్మెల్యే అభయ్ పాటిల్ సభ్యత్వల నమోదు కార్యక్రమంలో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభయ్ పాటిల్ మాట్లాడుతూ, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల హైడ్రాను ప్రవేశపెట్టి పేద ప్రజలకు ఒక న్యాయం తన సొంత సోదరుడికి మరో న్యాయం చేస్తూ అన్యాయం చేస్తున్నారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీ ల హామీ ఇచ్చి మోసం చేశారని మొత్తం హామీలను నెరవేర్చలేకపోయారని విమర్శించారు. గడపదేళ్ల టిఆర్ఎస్ కుటుంబ పాలన అవినీతి అప్పుల రాష్ట్రంగా మార్చితే నేటి కాంగ్రెస్ పాలన ఘోర వైఫల్యాలతో కొనసాగుతుందని ఆరోపించారు. రాబోయే సంస్థ గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని బలపరచాలని పిలుపునిచ్చారు.గత సభ్యత్వ నమోదు ద్వారా 11 లక్షల సభ్యత్వం ఉంటే ఇప్పుడు ఆ మార్క్ దాటిపోయిందని ఆయన అన్నారు. దీనికి కారణం కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగెత్తారని వాళ్లు మార్పు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. మోడీ విధానాలతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బిజెపిని ప్రజలు స్వచ్ఛందంగా బలపరుస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు యువత రైతులు అన్ని వర్గాలను సభ్యత్వ నమోదు సందర్భంగా కలిసి వారిని పార్టీలోకి ఆహ్వానించాల్సిన అవసరం పెద్ద ఎత్తున ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,జిల్లా అధ్యక్షులు,మండల అధ్యక్షులు,ముఖ్య నాయకులుపాల్గొన్నారు.

# అబ్బురపరిచేలా నక్షత్ర వనం..

**శ్రీలక్ష్మీ హయగ్రీవ సన్నిధానంలో వన మహోత్సవం 27 నక్షత్రాలకు సంబంధించిన మొక్కలు నాటే వేడుక..**

**యాదాద్రి ప్రధానార్చకుడు లక్ష్మీనారసింహాచార్యుల యోచన**

**మొక్కల సేకరణకు అహోరాత్రులు శ్రమించిన వృక్ష జీవి డాక్టర్ వద్రాణ మార్కండేయులు..**

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**

**నక్షత్ర గమనంపై ఆధారపడి హైందవ సంస్కృతి ముందుకు సాగుతోంది... సూర్యమానం.. చంద్రమానం ఆధారంగా పండుగలు.. పర్వదినాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది... మానవుని పుట్టుక నుంచి.. చివరి క్షణం వరకు భారతీయ సంస్కృతిలో ముఖ్య భూమిక పోషిస్తున్న నక్షత్రాలకు సంబంధించి.. తెలంగాణలోనే తొలిసారి నక్షత్ర మొక్కల పెంపకానికి యాదాద్రి సిద్ధమవుతోంది.శ్రీలక్ష్మీ హయగ్రీవ సన్నిధానంలోని.. ఉచిత వేద పాఠశాల ప్రాంగణంలో నక్షత్ర మండలంలోని 27నక్షత్రాలకు సంబంధించిన మొక్కలను నాటేందుకు యాదాద్రీశుని ఆలయ ప్రధానార్చకులు మాన్యశ్రీ నల్లంతీగళ్ లక్ష్మీనారసింహా చార్యుల మది నుంచి పుట్టిన ఆలోచనకు ప్రముఖ వైద్యులు వృక్ష జీవి డాక్టర్ వద్రాణ%శీ% మార్కండేయులు కార్యరూపంలోకి తీసుకువస్తున్నారు...**



తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నారసింహ స్వామి ఆలయం సమీపంలోని శ్రీలక్ష్మీ హాయగ్రీవ స న్నిధానంలోని ఉచిత వేద పాఠశాల ప్రాంగణంలో నక్షత్ర వనం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. అక్టోబర్ 2న ప్రముఖ వైద్య నిపుణులు వృక్ష జీవి డాక్టర్ వద్రాణ%శీ% మార్కండేయులు సహకారంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 27 నక్షత్రాలకు సంబంధించిన మొక్కలను నాటనున్నారు.

యాదగి రిగుట్ట ప్రధానార్చకుని మది నుంచి..

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నారసింహస్వామి ఆలయ ప్రధానార్చకులు మాన్యశ్రీ నల్లంతీగళ్ లక్ష్మీనారసింహాచార్యుల మది నుంచి పుట్టిన ఈ ఆలోచన నుంచి ఈ మహోత్తర కార్యక్రమానికి అడుగులు పడ్డాయి. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి, పున:ప్రతిష్టాపన కార్యక్రమాలతో తన ప్రత్యేకతను చాటిన లక్ష్మీనారసింహాచార్యులు,నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు నక్షత్ర వనం ఏర్పాటు గురించి తెలియజేయగా, అరుదైన మొక్కలు లభించడం ఆలస్యం కావడంతో, డా:మార్కండేయులు సహకారంతో ఆ అరుదైన మొక్కలను సంపాదించగలిగారు. దీంతో వృక్ష జీవి డాక్టర్ వద్రాణ మార్కండేయులు ఆధ్వర్యంలో అక్టోబర్ 2న నక్షత్ర వన మహోత్సవం నిర్వహించనున్నారు.

## నక్షత్రాలు సంబంధిత మొక్కల వివరాలు


అశ్విని విషముష్టి , భరణి ఉసిరి,కృతిక - మేడి,రోహిణి నేరేడు, మృగశిర సండ్ర,ఆర్ద్ర -ఎర్రచందనం, పునర్వసు వెదురు, పుష్య రావి,అశ్లేష పొన్న,మఘ మర్రి, పూర్వపాల్గుణ మోదుగ,పాల్గుణి గన్నేరు,హస్త అడవి మల్లె,చిత్త మారేడు, స్వాతి వేరుమద్ది విశాఖ వెలగ అనురాధపొగడ,జ్యేష్ఠ బూరుగ,మూల నారవేప, పూర్వాషాఢ తిప్పతీగ,ఉత్తరాషాఢ -పనస,శ్రావణ జిల్లేడు,ధనిష్ట మునగ,శతభిష కదంబ, పూర్వభాద్రపద మామిడి,ఉత్తర భాద్రపద వేప,రేవతి ఇప్ప

వన మహోత్సవానికి హాజరుకానున్న ప్రముఖులు

నక్షత్ర వన మహోత్సవానికి పద్మశ్రీ వనజీవి రామయ్య, పద్మశ్రీ పీ.హనుమంతరావు, పద్మశ్రీ డా:గోపాలకృష్ణ గోఖలే,వంశీ రామరాజు,బ్రిటీష్ హై కమిషనర్ గెర్త్ వ్యాన్,డా:ఐశ్వర్య, కలెక్టర్ హనుమంతు, పమేల సత్పతి, డా:నందకిషోర్ యర్రంశెట్టి,పసునూరి భాస్కర్,తెలంగాణ సోలార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్,బియాన్ ఎండీ గిరిధర్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు,వైద్యులు, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలు సుభీక్షంగా ఉండాలన్న తలంపుతో తెలంగాణాలోనే ప్రప్రథమంగా నక్షత్ర వనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహా స్వామి ఆలయ ప్రధానార్చకులు మాన్యశ్రీ నల్లంతీగళ్ లక్ష్మీనారసింహా చార్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభీక్షంగా ఉండాలని,దేశంలో కూడా ఎక్కడా నక్షత్రాలకు సంబంధించి పూర్తి స్థాయిలో మొక్కలు లేవని ఆయన తెలిపారు.లక్ష్మీ నారసింహుడి ఆశీస్సులతో,జన్మ నక్షత్రాల సహకారం ఉండాలన్న తలంపుతో ఈ నక్షత్ర వన మహోత్సవానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు.

# కుత్బుల్లాపూర్ కు మెట్రో సేవలను విస్తరించాలని మెట్రో ఎండి ఎన్వీఎస్ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్..



(ప్రజా వినికిడి,కుత్బుల్లాపూర్): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా మహానగర ప్రజలకు తన సేవలను అందిస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) ఫేజ్ -2 లో కుత్బుల్లాపూర్ కు మెట్రో సేవలను విస్తరించాలని కోరుతూ,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బేగంపేట్ లోని హైదరాబాద్ మెట్రో రైల్ భవన్ లో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,నిత్యం ఎంతోమంది ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చుతూ దేశంలోనే మూడవ అతిపెద్ద మెట్రో రైల్ సంస్థగా నిలిచిన హైదరాబాద్ మెట్రో రైల్ ను విస్తరించాలని భావిస్తున్న ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తూ, మెట్రో రైల్ ఫేజ్ -2 విస్తరణలోకుత్బుల్లాపూర్ ప్రాంతాన్ని ప్రాధాన్యతను ఇవ్వాలని..భాగ్యనగరానికి ఉత్తర దిక్కున అతివేగంగా అభివృద్ధి చెందుతున్న కుత్బుల్లాపూర్ ప్రాంతం నుంచి లక్షలాదిమంది ఉద్యోగులు నగరంలోని వివిధ ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.అంతేకాక కుత్బుల్లాపూర్- సుచిత్ర - కొంపల్లి ప్రాంతాలతో పాటు ఐడీపీఎల్ - చింతల్ - షాపూర్ నగర్ - జీడిమెట్ల - సూరారం - దుండిగల్ ప్రాంతాల నుంచి నిత్యం లక్షలాదిమంది ప్రయాణిస్తుంటారని..హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణలో భాగంగా....రూట్ -1: గండి మైసమ్మ నుంచి సూరారం - జీడిమెట్ల - షాపూర్ నగర్ - చింతల్ - బాలానగర్ చౌరస్తా మీదుగా భరత్ నగర్ మెట్రో స్టేషన్ వరకు అదేవిధంగా రూట్ -2 : మేడ్చల్ నుంచి కొంపల్లి - సుచిత్ర - బోయిన్ పల్లి -మీదుగా సికింద్రాబాద్ కు మెట్రో రైల్ ను ఏర్పాటు చేస్తూ నూతన మెట్రో లైన్ లను ఏర్పాటుచేయాలి. కాబట్టి హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణలో భాగంగా కుత్బుల్లాపూర్ కు మెట్రో రైల్ విస్తరణ ను చేపట్టి ప్రజలు సుదూర ప్రాంతాలకు వేగంగా చేరుకునేలా చూడాలని వినతి పత్రంలో కోరారు. మెట్రో ఎండీ ని కలిసి వారిలో ఎమ్మెల్యే తో పాటుగా దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్,పుప్పాల భాస్కర్,పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక





# శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో

## ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు..

ప్రజావినికిడి,(షాద్ నగర్):

మంగళవారం రోజు షాద్ నగర్ శ్రీ చైతన్య టెక్నో స్కూల్ లో ప్రిన్సిపల్ ఆనంద్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, తెలంగాణ చరిత్రలో బతుకమ్మకు అత్యంత ప్రాధాన్యత ఉందని అన్నారు.తెలంగాణ మహిళా మణులు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారి నవరాత్రుల సందర్భంగా రంగురంగుల పూలతో అలంకరణ చేసి బతుకమ్మ ఏర్పాటు చేసుకొని ప్రతినిత్యం మహిళా మణులు కోలాటాలు నృత్యాలతో ఎంతో సంబరంగా ఈపండుగను జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు రకరకాల పూలతో ఏర్పాటు చేసిన బతుకమ్మ చుట్టు కొలహలంగా దాండియా అలాగే నృత్యాలు చేసి ఆనందంగా జరుపుకున్నారు.



బతుకమ్మ అలంకరణలో విద్యార్థినీనులు.. మల్లాలం అద్వైత,నిత్యశ్రీ..

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న కె.యం.ప్రతాప్



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 127 రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో, స్కూల్ మేనేజ్మెంట్ వారు నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,కె.యం. ప్రతాప్.ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ,విద్యార్థులకు విద్యతో పాటు, మన సాంస్కృతి సంప్రదాయాలను అందిస్తున్నందుకు స్కూల్ మేనేజ్మెంట్ వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు,స్కూల్ మేనేజ్మెంట్ వారు, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా :శంభీపూర్ రాజు..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్సీ,మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలుమంగళ వారం శంభిపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు.సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

## శ్రీఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ లో బతుకమ్మ వేడుకలు..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 125 డివిజన్ గాజులరామారం లో గల చిత్తారమ్మ దేవి నగర్ లో శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ నందు బతకమ్మ వేడుకలలో పాల్గొన్న ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ మరియు టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి,ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు , ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పున్నారెడ్డి మాట్లాడుతూ, దసరాకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేశారు.


## ఆరు గ్యారెంటీల్లో ఒక సంక్షేమ పథకమైనా... బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో అమలు చేసిందా..?

**దొంగ దీక్షలను అన్నదాతలు నమ్మరు..**
**శంషాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్..**



ప్రజావినికిడి, (శంషాబాద్):అక్టోబర్ 1,కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ఆరు గ్యారెంటీల్లో ఒక సంక్షేమ పథకమైనా.. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో అమలు చేసిందా అని శంషాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకకాలంలో రూ.2లక్షల రుణాలు మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికె దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో దొంగ దీక్షలకు బీజేపీ నేతలు దిగితే..హైడ్రా పేరుతో డ్రామారావు హైడ్రామా చేస్తున్నారని మండిపడ్డారు.ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ దే అన్నారు. ఆగ్రహం వ్యక్తం చేశారు.గడ్డం శేఖర్ యాదవ్ . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన చేస్తుంటే గజినీ ప్రభుత్వ సంస్థలను తెగనమ్ముతూ, కార్పొరేట్ పాలన చేస్తున్న మోడీ ఏమవుతారో చెప్పాలని కేంద్రమంత్రులు,రాష్ట్ర నాయకత్వాన్ని శేఖర్ యాదవ్ ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల మెప్పుకోసమే బీజేపీ, బీఆర్ఎస్ కలిసి నాటకం ఆడుతున్నారు ఆయన అని అన్నారు.

## కె.యం.ప్రతాప్ ను కలిసిన నూతన సంక్షేమ సంఘం సభ్యులు... దేవాలయ కమిటీ సభ్యులు..



ప్రజా వినికిడి,(కుత్బుల్లాపూర్):
130 సుభాష్ డివిజన్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీలో జరిగినటువంటి సంక్షేమసంఘం ఎన్నికలలో, ఎస్.విజయసాగర్ రెడ్డి వరుసగా మూడవసారి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.ఈ మేరకు సంక్షేమ సంఘం వారు శ్రీసాయిబాబా దేవాలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.దేవాలయకమిటీఅధ్యక్షునిగాబి.యాదగిరి యాదవ్, ప్రధాన కార్యదర్శి గా నందమ్ గౌడ్ ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు,దేవాలయ కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ గ్రామంలోని, సిపిఆర్ కాలనీలో రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పెద్దలు,కె.యం.ప్రతాప్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, లుబోకేతో సత్కరించారు.ఈ సందర్భంగా ప్రతాప్ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం వారిని, శ్రీ సాయిబాబా దేవాలయ కమిటీ వారిని అభినందించారు.సంక్షేమ సంఘం వారికి, దేవాలయ కమిటీ వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారుఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, కార్యవర్గ సభ్యులు వి. హరిబాబు,జి.ఎస్. రాజు,ఎస్ కే విరాజు, సుందరయ్య,శంకర్ చారి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## సహకార మెట్ల ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న ఎమెల్సీ శంభీపూర్ రాజు ...





ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):నర్సాపూర్ సమీపంలోని శ్రీ సహకార మెట్ల ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు . ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన యజ్ఞంలో పాల్గొని మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, 125 డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ రాం రెడ్డి, నాయకులు పోలీస్ గోవింద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికులకు భద్రత కల్పించాలి..




ప్రజావినికిడి, (ముషిరాబాద్) : నేషనల్ అలయన్స్ ఆఫ్ సోషల్ సెక్యూరిటి తెలంగాణ జాయింట్ ఆక్షన్ కమిటి ఆధ్వర్యంలో " అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రతపై " రాష్ట్రస్థాయి సమావేశాన్ని హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ నాస్ కన్వీనర్ పోగురి చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఢిల్లీ నాస్ ప్రతినిధి మనాలి బెన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మనాలి, పోగురి చెన్నయ్య మాట్లాడుతూ అసంఘిటిత కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతను కల్పించాలన్నారు. అంతే కాకుండా నాస్ చట్టం నిబంధల కోసం గత 20 ఏండ్ల నుండి పోరాడుతున్నామని తెలిపారు.సామాజిక భద్రత కోడ్ లో 5 డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని ఆకాంక్షించారు.కార్మిక సంక్షేమ బోర్డులో నమోదు చేసుకోవాలని,50 వేల రూపాయలు ప్రసూతి కోసం వేతన పరిహారం చెల్లించాలన్నారు. ఉద్యోగుల స్టేట్ ఇన్సూరెన్స్ ఈఎస్ఐతో చేసి అర్హులైన వారందరికి 5వేల పెన్షన్ ఇవ్వాలని, అంగ వైకల్యం,మరణ పరిహారం కింద 5 లక్షలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.కార్యక్రమంలో సేవా సంస్థ నిర్వాహకులు సాక్షి, కార్మిక సంఘ నాయకులు సుదర్శన్రావు, ఎన్ఏపీఎం జాతీయ నాయకులు మీరా సంఘమిత్ర,ప్రభాస్, ప్రవాసి సంఘం ప్రతినిధులు స్వదేశ్ పర్కిపండ్ల,తెలంగాణ భవన నిర్మాణ కార్మిక చైతన్య యూనియన్ నాయకులు కళ్లెపు చంద్రశేఖర ప్రసాద్, పత్తి లక్ష్మి, మా సంస్థ నిర్వాహకులు,కార్మిక నాయకులు మిర్యాలగూడ అంజయ్య,మహిళా హక్కుల వేదిక నాయకులు ఆశలత, దళిత బహుజన ఫ్రెండు జాతీయ అధ్యక్షులు పి.శంకర్, పులికల్పన,తెలంగాణ వ్యవసాయ వృత్తిదారులు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టగళ్ల వెంకటయ్య, మహిళా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి పద్మ, తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మార్పీఎస్ జాతీయనాయకులు పెద్దెల్లి జములయ్య,బి. నాగన్న,బుద్ధిష్ట సంఘం నాయకులు పి.బాలకృష్ణయ్య మొదలగు 62 రాష్ట్ర స్థాయి సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి లడ్డూపై సుప్రీం తీర్పు ఆశ్చర్యం..



ప్రజావినికిడి,(అంబర్ పేట్):
గత నెల రోజులుగా తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ, నెయ్యిలో కల్తీ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు విడ్డూరంగా ఉందని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ ఎద్దేవ చేశారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, దేవుడిని తమ రాజకీయాల కోసం భగవంతున్ని బైటకు లాగడం,భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పై చేసిన వ్యాక్యలు విస్మయానికి గురిచేస్తోంది తెలిపారు.ఏడాది నుండి అనేకమంది భక్తులు తిరుమల ఏడుకొండల స్వామి వారి ఆలయంలో ఇచ్చే లడ్డూలో నాణ్యత లేదు.లడ్డుల్లో రుచి, సుగంధం పరిమళించే లడ్డూలు కావని అనేకమంది లడ్డూలు తీసుకున్న భక్తులు పలుమార్లు హెచ్చరికలు కూడా చేశారని గుర్తు చేశారు. తిరుమల దేవస్థానం చైర్మన్ గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి గాని ఈవో గాని భక్తుల మొరవినే నాథుడు లేకుండా పోయారన్నారు.కానీ అంతలోపే ప్రభుత్వాలు మారడం చకచక జరిగి తెలుగు దేశం పార్టీ తిరిగి అధికారంలోకి రాగానే అన్ని శాఖలలోని ఉన్న కొందరిని ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందన్నారు. సీఎంగా చేపట్టిన చంద్రబాబు తీసుకొన్న చర్యలో భాగంగా కల్తీ నెయ్యి విషయాన్నిటెస్టింగ్ ల్యాబ్ కు పంపిన తర్వాతే అసలు రహస్యం బయట పడిందన్నారు.లడ్డూల కల్తీలో లక్షలాది భక్తులకు జరుగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని టీడీపీ జాతీయ ప్రచార కార్య దర్శి జె.దశరథ్ ప్రశ్నించారు.కోర్టు తీర్పుపై చంద్రబాబును అభినందించడం హర్షించ దగ్గ విషమన్నారు.

## శంషాబాద్ నర్సింగ్ మున్సిపల్ లో రోడ్ల పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..



ప్రజావినికిడి, (రాజేంద్రనగర్):అక్టోబర్ 01,
తన నియోజకవర్గం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో వేసే రోడ్ల పనులను అధికారులతో సమీక్షా నిర్వహిచారు.200 కోట్ల 25 లక్షల రూపాయలతో శంషాబాద్ మున్సిపల్ నార్సింగి మున్సిపల్ చేస్తున్న రోడ్డు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శంషాబాద్ రైల్వే క్రాసింగ్ నుండి ధర్మగిరి వరకు 60 కోట్ల రూపాయలు శంషాబాద్ బస్ స్టాప్ నుండి వయాసిస్ ఇంటర్నేషనల్ స్కూల్ రాల్లగూడ రోడ్డు 48 కోట్లు, ఎన్ హెచ్-44 తొండపల్లి జంక్షన్ నుంచి ఓ ఆర్ సర్వీస్ రోడ్డు,నర్సింగి మున్సిపల్ లింకు రోడ్డు కలుపుతూ ఓఆర్జి సర్వీసు రోడ్డు మంచిరేవుల వద్ద 13 కోట్లు,నియో పోలీస్ లేఔట్ కోకాపేట్ టు పైప్ లైన్ లింక్ రోడ్ 35 కోట్లు,లింకు రోడ్డు కనెక్టింగ్ బీరప్ప దేవాలయం నుంచి పైప్లైన్ రోడ్ 8 కోట్ల 25 లక్షలు పనులను ఆయన అధికారులతో సమీక్ష చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో కూడిన పనులను చేయాలని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన అధికారులకు సూచించారు.సమీక్షా సమావేశంలో హెచ్ ఆర్ డి సి ఎల్,డి ఈ విజయకుమార్,ఏ ఈ విక్రమ్ శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు,ఏ.ఈ. నరేష్ పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## రిటైర్డ్ ఏసిపి శ్రీధర్ గౌడ్ ని సన్మానించిన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర మీడియా సెల్ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు,



ప్రజావినికిడి,(హైదరాబాద్):అక్టోబర్ 01,
కూకట్పల్లి జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ గా పనిచేసి పదవి విరమణ పొందిన గనగాని శ్రీధర్ గౌడ్ ని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీధర్ గౌడ్ ప్రజలకు మెరుగైన సేవలను అందించారని కొనియాడారు.ఆయన గ్రేటర్ పురోఅభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని శ్రీధర్ గౌడ్ సేవలను కొనియాడారు.

## పద్మశాలీల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం...



ప్రజావినికిడి,(హైదరాబాద్):
యూనివర్సిటీకి, ఐఐటిహెచ్ కు కొండా లక్ష్మణ్ బాపూజీ నామకరణాన్ని స్వాగతించిన తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి.. పద్మశాలీల సంక్షేమ కోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నదని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి హర్షం వెలిబుచ్చారు. నికార్సైన తెలంగాణవాది కొండా లక్ష్మణ్ బాపూజీ అని, తెలంగాణ స్వరాష్ట్రం కోసం పరితపించిన తెలంగాణ వాది ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. రాష్ట్రంలో పద్మశాలీలకు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి ఇది నిదర్శనమని కమర్తపు మురళి అని అన్నారు. తెలంగాణను సాధించడం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితాన్నే పణంగా పెట్టారని, ఎన్నో పదవులను స్వచ్ఛందంగా వదులుకున్నారని కమర్తపు మురళి కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం జలదృశంలోనే 2 వేల సంవత్సరంలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావ తొలి సదస్సును నిర్వహించిన విషయాన్ని కమర్తపు మురళి గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి కృషితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రారంభించిన ఐఐటిహెచ్ కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుతోనేప్రారంభించిన విషయాన్ని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు,సూర్యాపేట మార్కండేయ పద్మశాలి సంఘం మిట్టకోల సతీష్ కుమార్ గుర్తు చేశారు. నికార్సైన తెలంగాణ వాది కొండా లక్ష్మణ్ బాపూజీ,గతంలో చట్టసభలలో పలుమార్లు ప్రాతినిధ్యం వహించి, ఆ పదవులను తృణప్రాయంగా వదిలేసిన విషయాన్ని మనం ఒకసారి గుర్తు చేసుకోవాలని మిట్టకొల సతీష్ కుమార్ అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీకి మనం ఎంత చేసినా తక్కువే అని అన్నారు.బీసీలకు చెందిన నాయకులను ఒక కులానికో,ఉప కులానికో పరిమితం చేయడం సబబు కాదని కొండా లక్ష్మణ్ బాపూజీ అందరివాడని మిట్టకోల సతీష్ కుమార్ ఈ సందర్భంగా కొనియాడారు.

## ఒక్క ప్రాణం ఖరీదు 3 నిమిషాలు...

**జవహర్ బాల్ మంచ్ చైర్మన్ మామిడి రిషికేష్ రెడ్డి.. ఆధ్వర్యంలో**
**సిపిఆర్ పై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన...**
**శిక్షణ ఇచ్చిన డాక్టర్ రవి కుమార్...**




**ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):అక్టోబర్ 1:** ప్రస్తుతం చిన్న, పెద్ద వయస్సు తో నిమిత్తం లేకుండా గుండెపోటు వస్తున్న సందర్భంలో, ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్త చర్యలుగా సిపిఆర్ ట్రైనింగ్ తీసుకోవడం చాలా అవసరం.ఎదుటి వారికి ఆపద వచ్చినప్పుడు గుండె సంబంధిత ఇబ్బందులు, గుండె పోటు వచ్చింది అని ఎదుటి వారికి సందేహం రాగనే కేవలం మూడు నిమిషాలలోపు సిపిఆర్ చేయడం వల్ల గుండెపోటుకు గురైన వ్యక్తి ప్రాణం కాపాడవచ్చు.అలాగే సిపిఆర్ ద్వారా 90% వారి ప్రాణాలు కాపాడడానికి వీలు ఉంటుంది. మంగళవారంజూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంకటగిరి లోని గుడ్ సిటిజన్స్ కాన్సెప్ట్ స్కూల్లో, జవహర్ బాల్ మంచ్ చైర్మన్ మామిడి రిషికేశ్ రెడ్డి, ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ క్యాంప్ తో పాటు సిపిఆర్ పై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు డాక్టర్ రవి కుమార్ అవగాహన కల్పించారు.ఈ క్యాంప్ ద్వారా సీపీఆర్ చేయడం ట్రైనింగ్ ద్వారా ఆపదలో ఎదుటివారికి సహాయం చేయడం మాకు ఉపయోగంగా ఉంటుందని ఈ సందర్భంగా విద్యార్థులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బాల్ మంచ్ స్టేట్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, విద్యార్థులతో పాటు స్కూల్ కరస్పాండెంట్ నసీం ఉన్నిసా బేగం, ప్రిన్సిపల్ అయు ఖాన్ మొదలైన వారు పాల్గొన్నారు.

## గాంధీజీ బోధనలు ఎల్లవేళలా ఆచరణీయం.

**జాతిపితకు మాజీ ముఖ్యమంత్రి నివాళులు**

ప్రజావినికిడి,(హైదరాబాద్): ):
దేశ స్వాతంత్ర్య సాధన కోసం సాగిన మలి దశ పోరాటాన్ని శాంతియుతంగా నడిపించి, గమ్యాన్ని చేరుకున్న జాతిపిత మహాత్మా గాంధీ అందించిన ప్రజాస్వామిక స్ఫూర్తి, తెలంగాణ సాధన కోసం తాను సాగించిన మలిదశ పోరాటం లో ఇమిడివున్నదని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు.గాంధీ జయంతి ( అక్టోబర్ 2) సందర్భంగా దేశం కోసం వారు చేసిన కృషిని, త్యాగాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. బాధితులకే సహనం ఎక్కువగా ఉండాలని, శాంతియుత మార్గాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే, తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి విజయం సాధించేందుకు మార్గం సుగమం అవుతుందనే గాంధీజీ కార్యాచరణ తన తెలంగాణ ఉద్యమ పంథాను ముందుకు నడిపించిందని కేసీఆర్ తెలిపారు.భారత ప్రజలు మెచ్చేలా శాంతియితంగా పార్లమెంటరీ పంథాలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అనతి కాలం లోనే దేశం గర్వించే దిశగా అభివృద్ధి పథంలో నిలిపిన నాటి బిఆర్ఎస్ ప్రభుత్వ కృషి వెనక గాంధీజీ స్ఫూర్తి ఇమిడివున్నదని కేసీఆర్ అన్నారు. గాంధీజీ బోధనలు కార్యాచరణ అన్ని కాలాలకు అన్ని వర్గాలకు ఆచరణీయమని కేసీఆర్ పునరుద్ఘటించారు.

# హైడ్రా ఉండాల్సిందే..

**హైడ్రా భవిష్యత్ తారక మంత్రం కానీ... జరా మానవత్వంబీ అవసరం..**
**ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ మూసిప్రక్షాళనాలి? ఇక మీదట కానే కాదు...**



బీఆర్ఎస్ నాయకురాలు గుండ్రాతి శారదా గౌడ్

ప్రజావినికిడి,(అంబర్ పేట్):
మూసి నది వికారాబాద్ లో పుట్టి హైదరాబాద్ అంతా ఒక 265 కిమీ పారుతుంది.. అదేదో సినిమాలో హైదరాబాద్ కు నది తీసుకువస్తా అంటాడు కానీ మన హైదరాబాద్ నడిబొడ్డున ఒక అపురూపమైన సుందరమైన నది ఉండేది ఇప్పటికి సజీవంగా ఉంది అనేది తెలంగాణా ప్రజలు తెలుసుకొని అర్ధం చేసుకోవాలి.మూసి నది పరివాహక ప్రాంతం హైదరాబాద్ లో 55కిమి ఉంది దాదాపుగా 2500 మంది ఇండ్లు ఉన్నాయి మీరు మూసి రివర్ బెడ్ లో ఉన్నారు.కావునా మీ ఆరోగ్యం కు ప్రమాదం అని వాళ్ళకు నిదానంగా భవిష్యత్ తరాలకోసం ఎట్లా ఉపయోగపడుతుంది తెలియజేయాలి.
మూసిలో ఇప్పటికి గడ్డి కూరగాయలు పండిస్తున్నారు ఆ గడ్డి తిన్న ఆవులు బర్రెల పాలు విష తుల్యం అని రిపోర్ట్స్ వచ్చాయి పాలకూర క్యాబేజీ క్యాలీఫ్లవర్ మొదలైన కూరగాయలలో విషపూరిత పదార్థాలు ఉన్నాయి తినొద్దు అని డాక్టర్స్ చెబుతున్నారు. మా జడ్జి మేడం కూడా ఒకసారి ఈ ప్రస్తావన తీసుకు వచ్చారు. ఇప్పటికే కెసిఆర్ ప్రభుత్వం ఎస్ టి పి ల ద్వారా మురుకి నీరు శుద్ధి మొదలు పెట్టింది, ఇప్పుడు రేవంత్ సర్కార్ హైడ్రా ద్వారా మూసి సుందరికరణ కష్టం అయినా ఒప్పించి మెప్పించి ఆపకుండా స్వార్ధరహితంగా ముందుకు సాగాలి,
నివాసం,ఉపాధి కల్పించాలి విద్యా వైద్యం ఫ్రీ చేయండి వారి కుటుంబాలకు, డిగ్రీ ఉంటే యువతకు జాబ్స్ ఇవ్వండి అలాగే రేపుమూసి టూరిజం డెవలప్మెంట్ లో వారి కుటుంబాలకు 5% సెర్ ఇవ్వండి వాళ్ళు తెలంగాణా బిడ్డలే భూమికీ బదులుగా ఎంత ఇచ్చినా తక్కువే సీఎం అనుముల రేవంత్ రెడ్డి. సమస్యకు పరిష్కారం ఎప్పుడూ కూడా విన్ విన్ సిట్యుయేషన్ ఉండాలి ఎవరూ కూడా ఓడొద్దు ఇద్దరూ గెలవాలి మాటల్లో చేతల్లో మానవత్వం మస్ట్ శుడ్ సీఎం సాబ్అధికారులు పోలీస్ అందరూ సంయమనం పాటించి సర్ది చెప్పండి
ఇంత డేర్ డెవిల్ గా రేవంత్ రెడ్డి రంగనాథ్ చేస్తున్నారు.ఇది నిజం,ముందుకు వెళ్ళే సాహసం బహుశా ఏ సీఎం ఏ రంగనాథ్ కూడా ఇక చేయడు చేయలేరు,కానీ మీరు చేస్తున్నారు,ప్రతిపక్షం కాబట్టి అంటారు.సర్లే ఎన్నెన్నో అంటారు. పట్టించుకోవద్దు పతిపక్షంను కూడా ఇన్వాల్వ్ చేయండి, సమస్య వాళ్ళకు మీకన్నా ఎక్కువగా తెలుసు కానీ మీరు కాంప్రోమైస్ కాలేదు అంతే భయపడకుండా స్టెప్ తీసుకున్నారు రివర్ బెడ్ ఖాళీ తప్పని సరి చేయించండి కానీ ఇంట్లో ఆఫీస్ లలో సామాను ఉంటే మీరే జాగ్రత్తగా లోడ్ చేసి డబల్ బెడ్ రూమ్ ఇండ్లలలో అన్లోడ్ చేయండి24 గంటల్లో పోలీస్ అంబులెన్సు రివర్ బెడ్ ప్రాంతంలో అందుబాటులో ఉంచండి ఇవన్నీ చాలా ముఖ్యం సీఎం అలాగే హైడ్రా రంగనాథ్ ఒక్కమాట కోర్ట్ కు ఎన్ ఎచ్ ఆర్ సి జాతీయ మానవ హక్కుల కమిషన్ కీ చెప్పండి విషయం విషం అవుతుంది ఒకవేళ ఆపితే అని చెప్పండి, ఇక మీదట తీసుకునే జాగ్రత్తలు చెప్పండి
హైదరాబాద్ కు హైడ్రా అవసరం ఎమర్జెన్సీ నీడ్ ఆఫ్ ద అవర్ అని చెప్పండి.
తప్పదు నిష్టురం అయినా భవిష్యత్ లో హైడ్రా విలువ తెలుస్తుంది..హైడ్రా హైదరాబాద్ కు భవిష్యత్ తారక మంత్రం..కానీ మానవత్వం కూడా ముఖ్యం.ఖచ్చితమైన ప్రణాళిక,అమలు, మూసి బాధితులకు నివాసం ఉపాధి, అలాగే కౌన్సిలింగ్ వాళ్ళు మానసికంగా సిద్ధం కావడానికి, ఆరోగ్యం మీద ప్రభావం గాలి నీరు కలుషితం ఇతర ప్రాంతాలలో మొన్న ఏపి కేరళ ఉదాహరణలు చెప్పి ఓపించండి,ఇది మీ బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి,మూసి సుందరీకరణ తరువాత ముందు మూసి రివర్ బెడ్ లో ఉన్న వారిని ఖాళీ మరియు మూసి పూడిక తీత,పంటలు ఎవరు కూడా పండించకుండా కఠిన చట్టం తీసుకురండి అలాగే కూలగొట్టిన మెటీరియల్ మొత్తం వెంటనే ఎత్తి వేయండి లేకుంటే మీరు ఎంత చేసిన మళ్ళీ మొదటికి వస్తుంది హైడ్రా ఉండాల్సిందే కానీ జరా మానవత్వం బీ అవసరం ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ చేయలేము హైడ్రాకు ఖచ్చితమైన విది విధానాలు ప్రకటించాలని సీఎంకు బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకురాలు గుండ్రాతి శారదా గౌడ్ విన్నవించారు.

# 15 రోజుల ఆపరేషన్.. 27 మంది సైబర్ క్రిమినల్స్ అరెస్ట్

**తొలిసారి అంతర్రాష్ట్ర ఆపరేషన్ చేపట్టాం**
**టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి**
**బయటి రాష్ట్రాల్లో ఆపరేషన్స్‌కు స్పెషల్ టీం ఏర్పాటు**



ప్రజావినికిడి,(హైదరాబాద్):
సైబర్ నేరాల్లో కొల్లగొట్టిన సొమ్ము లావాదేవీలు చేసేందుకు తమ బ్యాంకు ఖాతాలను కమీషన్ల కోసం ఇస్తున్న (మ్యూల్ బ్యాంక్ ఖాతాలు) 27 మంది నిందితులను టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు.టీజీసీఎస్‌బీ అధికారులు తొలి సారిగా చేపట్టిన అంతర్రాష్ట్ర ఆపరేషన్‌లో భాగంగా ఈ నిందితులను రాజస్తాన్‌లోని 3 ప్రాంతాల్లో అరెస్టు చేసినట్టు బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీజీసీఎస్‌బీ ఎస్పీ దేవేందర్‌సింగ్, ఇతర అధికారులతో కలిసి ఆమె మాట్లాడారు.'అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను పట్టుకోవడానికి మొదటిసారిగా స్పెషల్ ఆపరేషన్ చేపట్టాం. రాజస్తాన్‌లోని జైపూర్, జోథ్‌పూర్, నాగ్‌పూర్‌లలో 15 రోజులపాటు చేసిన ఈ ఆపరేషన్‌లో 27 మందిని అరెస్ట్ చేశాం. దేశవ్యాప్తంగా జరిగిన 2,223 సైబర్ నేరాలలో వీరు నిందితులుగా ఉన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 189 సైబర్ నేరాల్లో వీరికి సంబంధం ఉంది. పట్టుబడిన వారిలో నిరుద్యోగులతోపాటు కాంట్రాక్టర్లు, వ్యాపారాలు చేస్తున్నవారు..ప్రైవేటు ఉద్యోగులు కూడా ఉన్నారు. నిందితులు అందరూ విద్యావంతులే.వీరంతా 29 మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా రూ. 11.01 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు చేసినట్టు గుర్తించాం. తెలంగాణకు సంబంధించిన 189 కేసులలో కొల్లగొట్టిన రూ.9 కోట్లు వీరి బ్యాంకు ఖాతాల ద్వారానే పలు బ్యాంకు ఖాతాలకు మళ్లించారు. ఈ బ్యాంకు ఖాతాలను వినియోగించి చేసిన మోసాలలో ప్రధానంగా వ్యాపార పెట్టుబడులు, ట్రేడింగ్‌తోపాటు డిజిటల్ అరెస్టు వంటి నేరాలు ఉన్నాయి' అని శిఖాగోయల్ వెల్లడించారు.
కమీషన్ల కోసం తమ బ్యాంకు ఖాతాలను, వ్యక్తిగత వివరాలు ఇతరులకు ఇచ్చి చిక్కులు కొనితెచ్చుకోవద్దని ప్రజలను శిఖాగోయల్ హెచ్చరించారు. కాగా, స్పెషల్ ఆపరేషన్‌లో పాల్గొన్న డీఎస్పీలు కేవీ సూర్యప్రకాశ్, ఫణీందర్, వేణుగోపాల్‌రెడ్డి, హరికృష్ణ, కేవీఎం ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు రమేశ్, ఆశిష్‌రెడ్డి, రవికుమార్, శ్రీను నాయక్, సునీల్, ఇతర సిబ్బందిని శిఖాగోయల్ ప్రత్యేకంగా అభినందించారు.

# బిసి డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్త ఉద్యమం

## : ఆర్.కృష్ణయ్య



ప్రజావినికిడి,(హైదరాబాద్):
పార్లమెంటులో బిసి బిల్లు ప్రవేశ పెట్టి చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, %-% దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని, స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం సీట్లు కేటాయించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బిసి డిమాండ్ల సాధన కోసం దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడ్తామని హెచ్చరించారు. మంగళవారం బిసి భవన్‌లో బర్క కృష్ణ అధ్యక్షతన బిసి సంక్షేమ సంఘం ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకే రోజులో బిల్లు పెట్టి ఆఘమేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు కల్పించారని, చట్ట సభల్లో రిజర్వేషన్ల కోసం గత 30 సం.రాలుగా బిసిలు పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు.
దేశంలో బిసి లను బిచ్చగాళ్ళను చేశారని విమర్శించారు. బిసిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండ గొర్రెలు, బర్రెలు, 'పందులు, పెన్షన్లు ఇచ్చి ఓట్లు వేయించుకొని బిసిలను శాశ్వత బిచ్చగాళ్ళను చేస్తున్నారని ఆరోపించారు. కులగణన చేసి బిసిల జనాభా కూడా లెక్కించడానికి ఈ అగ్రకుల ప్రభుత్వాలకు మనసు రావడం లేదని ధ్వజమెత్తారు. బిసిలకు కేంద్రస్థాయిలో ఒక్క పథకం కూడా లేదని, కాలేజీ కోర్సుల్లో చదివే విద్యార్థులకు ఫీజులు కూడా మంజూరు చేయడం లేదని విమర్శించారు. 56 శాతం జనాభా కలిగిన బిసిలకు ఇంతవరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా ఈ కులాలను అణచిపెట్టారన్నారు. ప్రపంచంలో అణచివేతకు వివక్షకు గురైన అన్ని వర్గాలకు, అన్ని రంగాలలో వాటా ఇచ్చి ఇతర అభివృద్ధి చెందిన వర్గాలతో సమానంగా అభివృద్ధి చేశారని మనదేశంలో పీడిత కులాలను ఇంకా అణచి వేయడానికి చూస్తున్నారు తప్ప అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో బిసి నాయకులు గుజ్జ కృష్ణ, ఇతర నేతలు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## నిన్నెవరూ మ్యాచ్ చేయలేరు..

# 'అన్‌మ్యాచ్‌బుల్'

### రామ్‌చరణ్‌కు సమంత కితాబు




హీరో రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ నుంచి తాజాగా 'రా మచ్చా మచ్చా..' అంటూ రెండో పాట విడుదలైంది. ఈ పాట ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ క్రమంలో పాటలో రామ్‌చరణ్ డ్యాన్స్‌పై ఉపాసన, సమంతలు ప్రశంసలు కురిపించారు. రామ్‌చరణ్ తన పాటను షేర్ చేస్తూ.. 'ఈ భారీ పాటను నేను ఆనందించినట్లు.. మీరూ ఆనందిస్తున్నారని ఆశిస్తున్నా' అని రాశారు. ఈ పోస్ట్‌పై ఉపాసన స్పందిస్తూ.. మిస్టర్ సీ.. మీ డ్యాన్స్‌తో హై ఓల్టేజ్ పుట్టించారని రిప్లై ఇచ్చారు. ఇక, సమంత స్పందిస్తూ.. నిన్నెవరూ మ్యాచ్ చేయలేరు అంటూ.. 'అన్‌మ్యాచ్‌బుల్' అని పేర్కొన్నారు. దానికింద ఫార్మల్ ప్యాంట్, షర్ట్ ధరించి ఎవరు ఇలా డ్యాన్స్ చేయగలరు.. అంటూ రాసుకొచ్చారు. ఇదిలాఉండగా.. రామ్‌చరణ్ కథానాయకుడిగా, శంకర్ దర్శకత్వంలో 'గేమ్‌ఛేంజర్' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'రా మచ్చా మచ్చా'... పాటని సోమవారం విడుదల చేశారు. ఈ పాటకి తమన్ స్వరాలు సమకూర్చగా, అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. నకాశ్ అజీజ్ ఆలపించారు. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్‌తో కియారా అద్వానీ, అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, జయరామ్, నవీన్‌చంద్ర, ప్రకాశ్‌రాజ్‌తో పాటు పలువురు కీలక ప్రాతల్లో నటిస్తున్నారు.

# నిలకడగా రజనీకాంత్ ఆరోగ్యం



సూపర్ స్టార్ రజనీకాంత్ అస్వస్థతకు గురై ప్రస్తుతం చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా వైద్యులు తలైవాకి చిన్నపాటి సర్జరీ చేశారు. అనుభవగ్నులైన ముగ్గురు వైద్యులు రజనీకాంత్‌కు పొత్తికడుపు కింది భాగంలో స్టెంట్ వేశారు. ఈ పక్రియ విజయవంతమైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని.. రెండు లేదా మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. రజనీకాంత్ సోమవారం అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కడుపులో తీవ్రమైన నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను చెన్నైలోని అపోలో దవాఖానకు తరలించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీశ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక వైద్యుల బృందం సూపర్‌స్టార్‌కు చికిత్స అందిస్తున్నారు. ఇక తలైవా దవాఖానలో చేరిన విషయం తెలుసుకున్న ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం రజనీకి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.



## ఆ లెజండరీల గురించి నా పిల్లలకు చెబుతా




శోభిత ధూళిపాళ్ల. పేరుకి తెలిగింటి ముద్దుగుమ్మే కానీ హవా నడిపించేది మాత్రం బాలీవుడ్‌లో. అద్భుతమైన కథల ఎంపికతో పాటు తనదైన నటన శైలితో శోభిత తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. అక్కినేని నాగ చైతన్యతో ఎంగేజ్మెంట్ తర్వాత ఈ భామ తరుచుగా న్యూస్‌లో కనిపిస్తున్నారు. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియన్ సెల్వన్' సినిమా ఫ్రాంచైజీతో ఆమె మరోసారి నేషనల్ వైడ్‌గా తన యాక్టింగ్ కెపాసిటీని నిరూపించుకున్నారు. 'పొన్నియన్ సెల్వన్-1' సినిమా రిలీజై రెండు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా చిత్ర బృందంతో కలిసి ఆమె సందడి చేశారు. ఈ క్రమంలో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఒకటి వైరల్ అవుతోంది. తమిళనాడులో అత్యంత సంచలనం సృష్టించిన 'పొన్నియిన్ సెల్వన్' నవల ఆధారంగా దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన సినిమా పొన్నియిన్ సెల్వన్. రెండు భాగాలుగా తీర్చిదిద్దిన ఈ సినిమా ఘన విజయం సొంతం చేసుకుంది. తాజాగా ప్రకటించిన ప్రతిష్టాత్మక ఐఫా అవార్డులలో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా విక్రమ్ అవార్డ్ అందుకోగా, క్రిటిక్స్ ఛాయిస్‌లో ఉత్తమ నటిగా ఐశ్వర్యారాయ్ నిలిచింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ అంతా కలిసి ఫోటో షూట్ నిర్వహించారు. ఈ ఫోటోలను శోభిత ఇన్స్టాలో పోస్ట్ చేస్తూ ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. ఈ ఫోటోలో హీరో విక్రమ్‌తో పాటు జయం రవి, కార్తి, ఐశ్వర్యారాయ్, త్రిషలతో కలిసి శోభితా ధూళిపాళ్ల ఫోటోలకి పోజ్ ఇవ్వగా 'వీరందరు ఎవెంజర్స్, నా పిల్లలకు వీళ్ల గురించి చెప్తాను' అంటూ ఆమె తన అభిమానాన్ని చాటుకున్నారు. 2016లో బాలీవుడ్ విలక్షణ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన 'రామన్ రాఘవ్ 2.0' చిత్రంతో తెరంగ్రేటం చేసిన శోభిత హిందీ ఇండస్ట్రీలో స్థిరపడిపోయారు. కాగా 2018లో అడివి శేష్ యాక్షన్ స్పై ఫిల్మ్ 'గూఢచారి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. 2022లో వచ్చిన పొన్నియన్ సెల్వన్‌తో మరోసారి జాతీయ గుర్తింపు పొందారు. మరోవైపు మేడ్ ఇన్ హెవెన్, ది నైట్ మేనేజర్ వెబ్ సీరీస్‌లతో ఆమె ఓటీటీలోను ప్రత్యేక గుర్తింపు సాధించారు.

# మెగా హీరో సడెన్ సర్‌ప్రైజ్



మెగా హీరో వరుణ్ తేజ్ ప్రస్తుతం కరుణ కుమార్ దర్శకత్వంలో 'మట్కా' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమాలో వరుణ్ తేజ్ లుక్ ను ఇప్పటికే రివీల్ చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. దర్శకుడు కరుణ కుమార్ విభిన్న చిత్రాల దర్శకుడిగా పేరు సొంతం చేసుకున్న నేపథ్యంలో ఈ సినిమా పై మెగా ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకుల్లోనూ అంచనాలు పెరిగాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా వరుణ్ తేజ్ నటిస్తున్న ఈ సినిమా ఉంటుంది అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో మట్కా సినిమా రిలీజ్ ఎప్పుడు అంటూ గత కొన్ని రోజులుగా ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఎట్టకేలకు మట్కా టీం అధికారికంగా సినిమా విడుదల తేదీని ప్రకటించడం జరిగింది. వచ్చే నెలలోనే ఈ సినిమా విడుదల ఉంటుందని సమాచారం అందుతోంది. మొన్నటి వరకు డిసెంబర్ లో ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ భావించారు. కానీ ఇప్పటికే డిసెంబర్ లో పుష్ప 2 సినిమా విడుదల కాబోతోందని అధికారిక ప్రకటన వచ్చింది. ఇప్పుడు రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ సినిమా సైతం డిసెంబర్ లోనే విడుదల కాబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఒకటి రెండు రోజుల్లోనే సినిమాకు సంబంధించిన విడుదల తేదీ గురించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని అంతా భావిస్తున్నారు. వరుణ్ తేజ్ డిసెంబర్ లో రావడం అసాధ్యం అనే ఉద్దేశ్యంతో కాస్త ముందుగానే అంటే నవంబర్ లోనే సినిమాను విడుదల చేయబోతున్నారు. నవంబర్ 14వ తారీకున సినిమా ను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్ ను సైతం విడుదల చేయడం జరిగింది. పోస్టర్ లో వరుణ్ తేజ్ ను వింటేజ్ లుక్ లో చూసి ఫ్యాన్స్ హ్యాపీ ఫీల్ అవుతున్నారు. ఈ మధ్య కాలంలో వరుణ్ తేజ్ నటించిన వరుస సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరుస్తూ వచ్చాయి. దాంతో ఈ సినిమా పై అంచనాలు భారీగా ఉన్నాయి. మరి అంచనాలను ఈ సినిమా అందుకుంటుందో చూడాలి. డిసెంబర్ నెలలో రాబోతున్న పుష్ప 2 తో మెగా ఫ్యాన్స్ కి కచ్చితంగా వినోదాల విందు ఖాయం. పుష్ప సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో సీక్వెల్ గా రూపొందిన పుష్ప 2 కి ఆధరణ ఓ రేంజ్ లో ఉండే అవకాశం ఉంది. మరో వైపు రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న గేమ్ ఛేంజర్ సినిమా ను డిసెంబర్ మూడో లేదా చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా ఈ సినిమా ఉంటుంది అంటున్నారు. కనుక ఈ రెండు సినిమాలకు పోటీ వద్దు అనుకుని, జనవరి లో విడుదలకు అవకాశం లేక పోవడంతో మట్కా ను నవంబర్ లోనే విడుదల చేయాలని అనుకోవడం మంచి నిర్ణయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# వర్మ సినిమాలు చూసి నేర్చుకున్నా..!



టాలీవుడ్ లో అర్జున్ రెడ్డి సినిమాను తీసి దర్శకుడిగా కెరీర్ ను మొదలు పెట్టిన సందీప్ వంగ ప్రస్తుతం బాలీవుడ్ లో మోస్ట్ క్రేజీ దర్శకుడిగా పేరు దక్కించుకున్నాడు. ఈయన రణబీర్ కపూర్ తో చేసిన యానిమల్ సినిమా దాదాపుగా రూ.వెయ్యి కోట్ల వసూళ్లు నమోదు చేసింది. దాంతో ఆయన దర్శకత్వంలో సినిమాలను చేసేందుకు దాదాపు అందరు బాలీవుడ్ హీరోలు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం మాత్రం ఆయన ప్రభాస్ తో స్పిరిట్ సినిమాను చేసేందుకు సిద్ధం అవుతున్నాడు. గత కొన్ని రోజులుగా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఈ ఏడాది చివరి వరకు స్క్రిప్ట్ వర్క్ ను ముగించే అవకాశాలు ఉన్నాయి. సందీప్ వంగ తాజాగా జరిగిన ప్రతిష్టాత్మక ఐఫా అవార్డు వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడ ఉత్తమ ఎడిటర్ అవార్డును సొంతం చేసుకున్నారు. దర్శకుడిగానే కాకుండా ఉత్తమ ఎడిటర్ అవార్డును సొంతం చేసుకోవడం చాలా ప్రత్యేకమైన విషయం. అవార్డు తీసుకున్న సందర్భంగా సందీప్ వంగ మాట్లాడుతూ.. తాను రామ్ గోపాల్ వర్మ గారికి పెద్ద అభిమానిని. ఆయన సినిమాలు చూస్తూ నేను ఎడిటింగ్ ఎలా చేయాలి అనే విషయాలను నేర్చుకున్నాను. ఆయన సినిమాలు చూస్తూ ఇండస్ట్రీలో ఎంట్రీ ఇవ్వాలని అనుకున్నాను అన్నట్లుగా సందీప్ వంగ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రతిష్టాత్మక ఐఫా అవార్డు వేడుకలో వర్మ పేరు ఎత్తి సందీప్ వంగ చేసిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరు అభినందిస్తున్నారు. నిజంగా ఇది గొప్ప విషయం అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. ఇక సందీప్ వంగ మాట్లాడిన వీడియోను షేర్ చేసిన రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ.. ఇకపై నీ వద్ద నేను ఫిల్మ్ మేకింగ్ నేర్చుకోవాలి అనుకుంటున్నాను అంటూ కామెంట్ పెట్టాడు. వర్మ వంటి సీనియర్ గొప్ప దర్శకుడి నుంచి అలాంటి కామెంట్ రావడం గొప్ప విషయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో ప్రస్తుతం వీరిద్దరికి సంబంధించిన ఈ విషయం తెగ వైరల్ అవుతోంది. సందీప్ వంగ అర్జున్ రెడ్డిని హిందీలో కబీర్ సింగ్ అంటూ రీమేక్ చేసి సూపర్ హిట్ ను దక్కించుకున్నాడు. ఆ సినిమా సాధించిన వసూళ్లు, పొందిన గుర్తింపు కారణంగా అంచనాలు భారీగా నమోదు అయ్యాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా యానిమల్ సినిమాను రూపొందించారు. యానిమల్ సినిమా సాధించిన విజయం తో స్పిరిట్ సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. మరి ప్రభాస్ తో దర్శకుడు సందీప్ వంగ స్పిరిట్ ను ఎలా రూపొందిస్తాడు అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. భారీ అంచనాల నడుమ రూపొందబోతున్న స్పిరిట్ ను 2026 లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613